## త్రివిధ దళాల సేవలు ప్రజలు మరవరు : కలెక్టర్ ప్రావీణ్య



విరాళం అందచేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** దేశ రక్షణకై సరిహద్దులో భారతదేశ రక్షణకు సేవలు అందిస్తున్న భారత త్రివిధ దళాల సేవలను ప్రజలు మరవరని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, అదనపు కలెక్టర్ బాడుగు చంద్రశేఖర్, ఆర్‌డి మాధురి, జిల్లా అదనపు ఎస్పీ సిహెచ్ రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సాయుధ దళాల పతాల దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ ప్రావీణ్య తన వంతుగా విరాళాన్ని అందచేశారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## చేబర్తిలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై కేసు నమోదు

**మర్కుక్, డిసెంబరు 5 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో శుక్రవారం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని దుర్గమ్మ గుడి ఆవరణలో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కొందరు గ్రామస్తులు రాజకీయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో కొంత మంది వ్యక్తులు గ్రామ ప్రజలకు మాయమాటలు చెప్పి అమలుకాని హామీలు ఇస్తూ వారిని మభ్యపెట్టేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అంతేకాకుండా కొందరికి కండువాలు కప్పి ఒక కరపత్రాన్ని ఆవిష్కరించడం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రత్యక్షంగా ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మర్కుక్ ఎస్ఐ దామోదర్ స్పందించి సంబంధిత వ్యక్తులపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుత ఘటనపై విచారణ కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అక్రమ సమావేశాలు, ప్రలోభాలు, హామీలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

## నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి(మద్దూరు):** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడతలో స్వీకరిస్తున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి శుక్రవారం పరిశీలించారు. మద్దూరు క్లస్టర్ పరిధిలోని మద్దూరు, గాగిల్లాపూర్, నర్సాయిపల్లి, రేబర్తి క్లస్టర్ పరిధిలోని రేబర్తి, వంగపల్లి, వల్లాంపట్ల, బైరాన్‌పల్లి క్లస్టర్ పరిధిలోని బైరాన్‌పల్లి, బెక్కల్, తోర్నాల, దూళ్‌మిట్ట మండల పరిధిలోని దూళ్‌మిట్ట, జాలపల్లి, లింగాపూర్, కొండాపూర్ క్లస్టర్ పరిధిలోని కొండాపూర్, కూటిగల్, దుబ్బతండ, హనుమాతండా, రెడ్యానాయక్‌తండా, రామవరం క్లస్టర్ పరిధిలోని రామవరం, పోతారం, సేవాలాల్ మహరాజ్ తండా గ్రామాలల్లో పర్యటించి నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు.

### సిర్గాపూర్‌లో సబ్ కలెక్టర్...



సిర్గాపూర్‌లో నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

**సిర్గాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని శుక్రవారం సబ్‌కలెక్టర్ ఉమాహారతి సందర్శించి నామినేషన్ ప్రకియను పరిశీలించారు. ఎన్నికల అధికారులు జాగ్రత్తలు పాటిస్తూ పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా విధులు నిర్వహించాలని సబ్ కలెక్టర్ ఉమా హారతి సూచించారు.

### నాగల్‌గిద్దలో...

**నాగల్‌గిద్ద, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఈ నెల 17న జరగున్న మూడవ విడత పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం నామినేషన్ దాఖలుకు చివరిరోజు కావడంతో ఆయా గ్రామ పంచాయతీలకు పోటీచేసే సర్పంచ్, వార్డు సభ్యులు పెద్దసంఖ్యలో నామినేషన్‌లను దాఖలు చేశారు. నాగల్‌గిద్దలోని రైతువేదికలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాన్ని శుక్రవారం నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి పరిశీలించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాలని ఉమాహారతి సూచించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్, ఎంపిడిఓ ఉన్నారు.

### న్యాల్‌కల్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్...

**న్యాల్‌కల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని శుక్రవారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రతిభ శేఖర్, ఆర్‌డిఓ దేవూజా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట తహసీల్దార్ ప్రభులు, డిప్యూటీతహసీల్దార్ రాజిరెడ్డి ఉన్నారు.

### హుస్నాబాద్ ఎసిపి...

**కోహెడ, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మూడవ విడత సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను శుక్రవారం హుస్నాబాద్ ఎసిపి సాదారపు సదానందం, సిఐ కోండ్ర శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లోని కోహెడ మండలం బస్వాపూర్, శనిగరం, కోహెడ, సముద్రాల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను స్వయంగా పరిశీలించి, నామినేషన్ ప్రక్రియను గురించి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి నామినేషన్ సెంటర్ దగ్గరలో 100మీ.లలోపు నిషేధిత ఉత్తర్వులు అమలులో ఉంటాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోహెడ ఎస్సై పుల్ల అభిలాష్ ఉన్నారు.

## నామినేషన్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత

**-అభ్యర్థులకు టోకెన్‌లు ఇచ్చిన అధికారుల**



సిర్గాపూర్ రైతు వేదిక వద్ద ఉద్రిక్త నెలకొన్న దృశ్యం

**సిర్గాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఈ నెల 17న జరగనున్న 3వ విడత పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం నామినేషన్ దాఖలుకు చివరి రోజు కావడంతో మధ్యాహ్న సమయంలో ఆయా గ్రామాల నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు (సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు) నామినేషన్‌లను దాఖలు చేసేందుకు పెద్దఎత్తున తరలి రావడంతో మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతువేదిక, మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల వద్ద ఉద్రిక్త పరిస్తితి నెలకొంది. ఎస్ఐ మహేష్ నామినేషన్ కేంద్రాల వద్దకు చేరుకుని అభ్యర్థులు అధైరపడవద్దు, అందరి నామినేషన్‌లను స్వీకరిస్తారని, అందుకు పంచాయితీల వారిగా టోకెన్‌లను అభ్యర్థులకు అందచేశారు. ఉద్రిక్తగా మారిన నామినేషన్ కేంద్రాల వద్దకు తహసీల్దార్ కిరణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ హేమంత్, ఎంపిడిఓ శారదా దేవిలు చేరుకుని అభ్యర్థులందరి నుంచి ఆలస్యమయినా నామినేషన్‌లు స్వీకరిస్తామని భరోసా ఇవ్వడంతో ప్రశాంత వాతావరణం నెలకొంది.

### పోటీలో నిలిచిన అభ్యర్థులకు అవగాహన

**మర్కుక్, డిసెంబరు 5 (ప్రభాతవార్త):** రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్బంగా మర్కుక్ మండలంలోని 16 గ్రామాలకు సంబంధించి పోటీలో ఉన్న సర్పంచ్, వార్డుల అభ్యర్థులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపిడివో విక్రమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్నికల ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు నిశాంతి, విష్ణువర్ధన్, తహసీల్దార్ సరిత, ఎస్ఐ దామోదర్‌లు హాజరై మాట్లాడారు. ఎన్నికల నియమావళి, ఖర్చుల పరిమితులు, ప్రచార నిబంధనలపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటించారు.

## దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్లు అందించాలి

**మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్ డిసెంబరు 5, ప్రభాతవార్త ప్రతినిధి:** పంచాయతీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులతో వారికి కేటాయించిన విధులు సమర్ధ నిర్వహణకు తగు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి తప్పనిసరిగా అర్హులకు పోస్టల్ బ్యాలెట్ అందించాలని, ప్రతి గ్రామం, మండలాల వారీగా వివరాలు సేకరించి సంబంధిత రిటర్నింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసేలా చూడాలన్నారు. మొదటి విడత పోలింగ్ జరిగే గ్రామాల్లో ఓటు హక్కు ఉండి ఎన్నికలు విధులు నిర్వహించే సిబ్బంది డిసెంబర్ 8న, రెండో విడత వారికి 12న, మూడో విడతవారికి 15వ తేదీన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేలా ఆదేశాలు జారీ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్ నియామకం చేయాలని సూచించారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులకు సిబ్బందికి సంబంధించిన రవాణా సౌకర్యం ఏర్పాటు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విధినిర్వహణ, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ విధి విధానాలు, సంబంధిత వాటిపై సుదీర్ఘంగా చర్చించారు.

సమావేశంలో డిఆర్‌ఓ భుజంగరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, సైన్స్ అధికారి రాజిరెడ్డి జిల్లా రవాణా అధికారి వెంకటస్వామి, పాల్గొన్నారు.



తహసీల్దార్ ముందు పాత నేరస్థులను బైండోవర్ చేస్తున్న దృశ్యం

## తహసీల్దార్ ఎదుట పాత నేరస్థుల బైండోవర్

**చౌటకూరు, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివంపేట గ్రామానికి చెందిన ఆరుగురు పాత నేరస్థులను శుక్రవారం పుల్‌కల్ తహసీల్దార్ కృష్ణ ఎదుట బైండోవర్ చేశారు. శివంపేట గ్రామానికి చెందిన రవి, వడ్డె శ్రీకాంత్, గొలుసుల కుమార్, ద్యారంగుల అనిల్, ఉప్పు సాయికుమార్, మక్కని నవీన్‌లను పోలీసుల అదుపులోకి తీసుకుని పంచాయతీ ఎన్నికలను పురష్కరించుకుని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. గ్రామాల్లో అకారణంగా గొడవలు పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎన్ విశ్వజన్ హెచ్చరించారు.



ఎర్రవల్లి సర్పంచ్‌గా ఎన్నికైన కవిత రాంమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న కెసిఆర్

## కెసిఆర్‌ను కలిసిన దత్తత గ్రామాల ఏకగ్రీవ సర్పంచులు

**మర్కుక్, డిసెంబరు 5 (ప్రభాతవార్త):** మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దత్తత గ్రామాలైన ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాల్లో ప్రజలు ఏకమై సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఎర్రవల్లి సర్పంచ్ అభ్యర్థి కవిత రాంమోహన్‌రెడ్డి, నర్సన్నపేట సర్పంచ్ అభ్యర్థి గిల్క బాల్‌నర్సయ్యలు ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సిఎం కెసిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెసిఆర్ ఏకగ్రీవంగా ఎన్నికైన కవిత రాంమోహన్‌రెడ్డి, గిల్క బాల్‌నర్సయ్యలను శాలువాలతో సత్కరించి అభినందించడంతో పాటు మిఠాయిలు అందజేశారు. కెసిఆర్‌ను కలిసిన వారిలో మాజీ ప్రజాప్రతినిధులు భాగ్య బాల్‌రాజ్, ధనలక్ష్మి కృష్ణ, భాగ్య బిక్షపతి, గ్రామస్తులు కిష్టారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గీసు మల్లేశం, యువకులు తదితరులు ఉన్నారు.

### మల్లుపల్లి సర్పంచ్ ఏకగ్రీవం

**శివ్వంపేట, డిసెంబరు 5 (ప్రభాతవార్త) :** శివ్వంపేట మండలం మల్లుపల్లి గ్రామ సర్పంచ్‌గా బిఆర్ఎస్ మద్దతుదారుడు కెతావత్ నరేశ్ ఏకగ్రీవమయ్యారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ పబ్బమహేశుప్తా ఏకగ్రీవమైన సర్పంచ్ కెతావత్ నరేశకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



మల్లుపల్లి సర్పంచ్ కెతావత్ నరేశ్‌ను సన్మానిస్తున్న పబ్బమహేశ్‌గుప్తా,



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న భారతి లక్పతి నాయక్ తదితరులు.

## ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి

**రాష్ట్ర పరిశీలకురాలు భారతి లక్పతినాయక్**

**నర్సాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికల సర్పంచుల వార్డు సభ్యుల నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని రాష్ట్ర పరిశీలకురాలు భారతి లక్పతినాయక్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో చివరి రోజున జరుగుతున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులతతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా భారతి లక్పతినాయక్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న అధికారులకు సిబ్బందికి పలు సూచనలను సలహాలను ఇచ్చారు. అనంతరం నామినేషన్ల రిజిస్టర్లను పరిశీలించారు. భారతీ లక్పతినాయక్ వెంట సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు

### శివ్వంపేటలో నామినేషన్ కౌంటర్లను పరిశీలన...

**శివ్వంపేట, డిసెంబరు 5(ప్రభాతవార్త) :** గ్రామ పంచాయతీ మూడవ విడత సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ మూడవరోజు నామినేషన్ అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్ వేశారు. ఆకస్మికంగా రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ భారతి లక్పతి నాయక్ నామినేషన్ కౌంటర్లను పరిశీలించి కౌంటర్ల వద్ద నామినేషన్ ప్రక్రియను గమనించి అధికారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ భారతి లక్పతి నాయక్ మాట్లాడుతూ నామినేషన్ల నిర్వహణపై అధికారులు శ్రద్ధ వహించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని నామినేషన్ వేసే అభ్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహసిల్దార్ కమలాద్రి, డి.ఎస్.పి నరేందర్ గౌడ్, సీఐ రంగాకృష్ణ, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఎస్సై మధుకర్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

**కోహెడ, డిసెంబరు 5, ప్రభాతవార్త :** ఎన్నికల నియమావళిని ఎవరూ ఉల్లంఘించిన చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ అభిలాష్ హెచ్చరించారు. మండల పరిధిలోని మైసంపల్లి గ్రామానికి చెందిన పుప్పాల రమేష్(45), ఎట్టబోయిన శ్రీకాంత్(31)లు టిఎస్36ఎం1530 నంబరు గల ద్విచక్ర వాహనంపై ఎన్నికల నియామవళికి విరుద్దంగా మద్యం తీసుకెళ్తుండగా హనాల తనిఖీలో భాగంగా పట్టుబడడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తప్పవన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ గ్రామాలలో ప్రశాంత వాతరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

### వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు



కంది చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**కంది, డిసెంబరు 5, ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా డబ్బుల సరఫరా కాకుండా పోలీసులు శుక్రవారం మండల కేంద్రమైన కంది చౌరస్తాలో అటుగా వెళుతున్న వాహనాలను తనిఖీ చేశారు.

### మహిళ అదృశ్యం

**శివ్వంపేట, డిసెంబరు 5(ప్రభాతవార్త) :** అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి వస్తానని వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక ఎస్సై మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం... మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన శ్రావణి(19) డిగ్రీ సెకండ్ ఇయర్ చదువు పూర్తిచేసి ఇంటివద్ద ఉంటూ టైలరింగ్ నేర్చుకుంటుంది. ఈనెల 4న శ్రావణి తల్లికి అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి 4 గంటల సమయంలో వెళ్లింది. శ్రావణి అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చి 5 గంటలసమయంలో వెళ్లిపోయింది. శ్రావణి తండ్రి బొగ్గుల వెంకటేశం వెళ్లిచూడగా అక్కడ కూతురు లేకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయంపై శ్రావణి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

### మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలుశిక్ష

**-ఐదుగురికి రూ.50 వేల జరిమానా**

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 5 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి నాలుగురోజుల జైలుశిక్ష, ఐదుగురికి రూ.50వేల జరిమానా విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఏడుగురు పట్టుబడ్డారని తెలిపారు. వారిని శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా ఇద్దరికి 4 రోజుల జైలు శిక్ష విధించడంతో పాటు మరో ఐదుగురికి రూ.50వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

### వెల్దుర్తిలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**వెల్దుర్తి, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నిబంధనలు అమల్లో ఉన్నందున పోలీసులు అధికారులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం వెల్దుర్తి నుండి నర్సాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా మద్యం, డబ్బులు అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికలు సజావుగా. ప్రశాంతంగా. జరిగేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని పోలీసులు అధికారులు తెలిపారు.



వెల్దుర్తిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

## ప్రజాధనం వృధా... రైతుబజార్ నిరుపయోగం

*** రోడ్లకు ఇరువైపులా కూరగాయల విక్రయాలు * దొరికిందే సందుగా చలాన్లు కొడుతున్న పోలీసులు**

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 5, ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణంలో రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించిన రైతుబజార్, ఫంక్షన్‌హాల్ రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు నిరుపయోగంగా ఉండటం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాల్సిన మార్కెటింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ పాలకవర్గం, మున్సిపాల్ అధికారులు, నిమ్మకు నీరెత్తన్నట్లు వ్యవహిస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రైతు బజార్, ఫంక్షన్‌హాల్‌లను జిల్లా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి అప్పగించినా సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇవి అందుబాటులోకి రాక పట్టణం నడిబొడ్డున అలంకార ప్రాయంగా మారిందని అర్థమౌతుంది. ఈ విషయంలో ప్రజల కోరికమేరకు రెండు నెలల క్రితం మున్సిపల్, మార్కెటింగ్ అధికారులు కూరగాయలు క్రయ, విక్రయాలు జరిపే వారికి నోటీసులు ఇచ్చి ఉన్నపళంగా వారు అమ్ముకునే ప్రదేశం నుంచి రైతు బజార్‌కు తరలించాలని ఆదేశాలు జారీచేయడంతో రెండు రోజులు పట్టణంలో రోడ్లు, బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ కాంపెక్స్, మల్లెచెట్టు చౌరస్తా, పోలీస్ స్టేషన్ పక్క వీధిలో, అక్కన్నపేట చౌరస్తాల నుంచి విక్రయదారులు అందరూ రైతు బజార్‌లో దుకాణాలు తీసుకుని ప్రారంభించారు. అయితే అక్కడ ముందున్న షటర్‌లలో ఉన్న దుకాణాలకు మాత్రమే మంచి గిరాకీ అవుతుందని, అన్ని షాపులు లోపలే ఉండాలి లేదంటే తమకు ఇష్టం వచ్చిన దగ్గర అమ్ముకుంటామని వ్యాపారులు అందరూ ప్రారంభించిన మూడు రోజులకే అక్కడి నుండి వారి యథా విధి స్థానాలకు వెళ్లిపోయారు. మార్కెట్ సరిగ్గా లేకపోవడంతో రైతులు, వ్యాపారులు రోడ్లకు ఇరువైపులా కూర్చుని కూరగాయలు విక్రయిస్తున్నారు. భవనాలు నిర్మించి ఏండ్లుగడుస్తున్నా ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం వల్ల ఈ నిర్మాణాలు నాయకులు, అధికారుల కమీషన్ల కోసమా లేక ప్రజల సౌకర్యాల కోసం నిర్మిస్తున్నారా అని ఈ ప్రాంత ప్రజలు గుసగుసలాడుతున్నారు. అయితే ఈ ఆరోపణల వెనుక ఆంతర్యమేంటని ఆరాతీస్తే ఈ రైతుబజార్ నిర్మాణం కంటే ముందు అదే ప్రదేశంలో రూ 3కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని కూల్చివేసిన సందర్భం గురించి బయటకు వస్తుంది. ఇది పక్కన పెడితే ట్రాఫిక్ నియంత్రించాల్సిన పోలీసులు దొరికిందే సందుగాభావించి యధేచ్చగా వినియోగదారుల వాహనాలకు చలాన్లువేస్తూ ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా మార్కెట్ ధరలను నిర్ణయించకపోవడంవల్ల ఎవరికివారు ఇష్టం వచ్చిన ధరలకు వారు విక్రయిస్తూ వినియోగదారుల నడ్డి విరుస్తున్నారని చెప్పకతప్పదు. కోట్లు పెట్టి నిర్మాణాలు చేసిన భవనాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోగా కనీసం వెళ్లేందుకు రోడ్డూ సరిగా లేదని ఈ నిర్మాణాల విషయంలో అధికారుల అనాలోచిత కారణంగానే భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి నిరుపయోగంగా ఉన్న భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నిరుపయోగంగా ఉన్న రైతు బజార్ దృశ్యం



రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

## అట్టహాసంగా మంత్రి జన్మదిన వేడుకలు



మంత్రి దామోదర్ రాజనర్సింహను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

**జోగిపేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జన్మదిన వేడుకలను శుక్రవారం జోగిపేటలో అట్టహాసంగా నిర్వహించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకుగాను జన్మదిన వేడుకలను జోగిపేటలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జోగినాథ్ చౌరస్తా వద్ద భారీగా కార్యకర్తలు టపాసులు కాలుస్తూ గజమాలతో మంత్రిని సన్మానించారు. అక్కడినుంచి స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. ఈసందర్భంగా పలువురికి ట్రైసైకిళ్లను కూడా అందచేశారు.

## మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేతలు



మంత్రి దామోదర్ రాజనర్సింహకు కేక్ తినిపిస్తున్న సుభాష్‌రెడ్డి

**చౌటకూరు, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహను కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణానికి వెళుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహను చౌటకూరు సమీపంలోని 161వ జాతీయ రహదారిపై మాజీ ఎంపిపి అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలబొకేలను అందచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు విజయం సాధించేలా సమష్టిగా పనిచేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ నాయకులకు సూచించారు. ఆయాకార్యక్రమాల్లో ఆత్మకమిటీ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు పార్కుల రామాగౌడ్, మొగులయ్య, కరుణాకర్, వరకల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులందరికీ సంఘాలను ఏర్పాటు చేయాలి

**-ఏపిఎం సంగమేశ్వర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఏపిఎం సంగమేశ్వర్ తదితరులు

**నర్సాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
దివ్యాంగులందరికీ నూతనంగా సంఘాలను ఏర్పాటు చేయాలని ఏపిఎం సంగమేశ్వర్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్‌లోని మానసిక పునరావాస వికలాంగుల కేంద్రంలో మండల సమైక్య అధ్యక్షురాలు సుమలత అధ్యక్షతన అంతర్జాతీయ దినోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఏపిఎం సంగమేశ్వర్ మాట్లాడుతూ, దివ్యాంగుల కోసం నూతనంగా ఏర్పాటుచేసిన సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ పదిహేనువేలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన దివ్యాంగులకు సదరన్ సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు బస్సు పాసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం డిసిసిపి బ్యాక్ మేనేజర్ అభినవ్ మాట్లాడుతూ అర్హతగల వికలాంగులకు తమబ్యాంకు ద్వారా తమ వంతు సహాయాన్ని అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మానసిక పునరావాస వికలాంగుల కేంద్రంలో దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈపోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సిబిఓ ఆడిటర్ దత్తాత్రేయ, సిసిలు నర్సింలు, దేవిసింగ్, ప్రవీణ, పునరావాస కేంద్ర సిబ్బంది సుజాత, అన్నారావు, సుభాష్, ఆంజనేయులు, మల్లేశం ఆయా గ్రామాల దివ్యాంగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మూడోదశ నామినేషన్ల పర్వం



నామినేషన్‌కు తరలిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వెల్దుర్తి, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల కలహాలతో జోరుగా సర్పంచ్ అభ్యర్థులు డప్పుచప్పుళ్లు, ఆటపాటలతో నామినేషన్ వేశారు. శుక్రవారం చివరిరోజు కావడంతో వివిధపార్టీల సర్పంచ్ అభ్యర్థులతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు సైతం జోరుగా నామినేషన్లు వేశారు. అలాగే వార్డులకు సైతం మెంబర్‌గా నామినేషన్‌లను అభ్యర్థులు జోరుగావేశారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో చెర్లపల్లి గ్రామం నుండి సర్పంచ్‌కు ఒక నామినేషన్, వార్డులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలయ్యాయని అన్నారు. అలాగే శంషారెడ్డిపల్లి తండాకు సర్పంచ్ అభ్యర్థితోపాటు వార్డు అభ్యర్థులు ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేశారని అన్నారు. చెర్లపల్లి సర్పంచ్ అభ్యర్థిగా లంబాడి అరుణ, శామ్‌షారెడ్డిపల్లితాండ సర్పంచ్‌గా బానోత్ గణేష్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు.

## మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల జాబితా

**-ప్రకటించిన మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు**

**గుమ్మడిదల, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలంలోని వివిధ గ్రామాల కోసం కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచ్ అభ్యర్థులను మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు అధికారికంగా ప్రకటించారు. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి, ప్రజలకు సేవచేయడానికి తగిన అర్హతలు కలిగిన నాయకులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ప్రకటించిన సర్పంచ్ అభ్యర్థుల జాబితా ఇలా ఉంది– కొత్తపల్లి: కొక్కొండ రజిత, నాగిరెడ్డిగూడెం: గడ్డం కీర్తన, నల్లవల్లి: పులిమామిడి రాధిక, మంబాపూర్: కొత్తకొండ భాస్కర్, అనంతరం: మల్లగళ్ళ లావణ్య, కానుకుంట: ఇప్ప పెంటారెడ్డి, రామ్‌రెడ్డిబావి: సామల మహిపాల్‌రెడ్డి, వీరారెడ్డిపల్లి: తీగల లలిత. ఈసందర్భంగా పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

# ప్రశాంతంగా ముగిసిన స్థానిక ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ

**-జోరుగా నామినేషన్‌లు.. పోలీసుల గట్టి బందోబస్తు**

**నర్సాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్పంచ్, వార్డుసభ్యుల నామినేషన్ ప్రక్రియ చివరి రోజున ప్రశాంతంగా సజావుగా సాగింది. ఈ మేరకు శుక్రవారం నామినేషన్ల దాఖలకు చివరి రోజు అయినందున జోరుగా నామినేషన్‌లను దాఖలు చేశారు. నామినేషన్‌ల చివరిరోజున మండల పరిషత్ కార్యాలయం, మండల వనరుల కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాల వద్ద, చిల్డ్రన్ పార్కులో నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థుల మద్దతుదారులతో ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. సర్పంచ్ అభ్యర్థుల వెంట మద్దతుదారులు గుంపులుగుంపులుగా వస్తూ తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ నామినేషన్ కేంద్రాలను రాష్ట్ర పరిశీలకురాలు భారతి లక్పతినాయక్ పరిశీలించారు. అంతేగాక ఉదయం నుండి ఎన్నికల అధికారి, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో మధులత నామినేషన్ల కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రిటర్నింగ్ అధికారులకు సిబ్బందికి పలు సూచనలను, సలహాలను ఇవ్వడం జరిగింది. ఈ మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఆసక్తిగల అభ్యర్థులందరూ సర్పంచులకు, వార్డు సభ్యులకు పోటీచేస్తున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల కేంద్రాలవద్ద అభ్యర్థులు, వారి మద్దతుదారులతో సందడిసందడిగా మారింది. నామినేషన్ల కేంద్రాల వద్ద ఎలాంటి అలజడులు, అల్లర్లు జరగకుండా తూప్రాన్ డిఎస్పి ఆదేశాల మేరకు సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ మేరకు నర్సాపూర్‌లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సజావుగా ముగిసింది.



నామినేషన్‌ల సందర్భంగా కిక్కిరిసిన ఆయా అభ్యర్థుల మద్దతుదారులు, ప్రజలు తదితరులు

## రూ.50వేలకు మించి డబ్బు తరలిస్తే కఠినచర్యలు

**-తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి**



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో జయచంద్రరెడ్డి తదితరులు

**వెల్దుర్తి, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
రూ.50వేలకు నుంచి డబ్బులను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తూప్రాన్ ఆర్‌డిఓ జయచంద్రరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో మూడో దశ స్థానిక ఎన్నికల నామినేషన్‌లో భాగంగా నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల్లో సర్పంచ్ అభ్యర్థులు, వార్డుసభ్యుల అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఆయన పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ నేటితో ముగిస్తుందని శనివారం నామినేషన్ల పరిశీలన. ఫిర్యాదులను స్వీకరిస్తామని అన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. నామినేషన్లు ఎలా అయితే ప్రశాంతంగా జరిగాయో, అలాగే ఎన్నికలు సైతం జరిగేందుకు ప్రజలు అందరు సహకరించాలని ఆయన కోరారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి మద్యం, డబ్బు పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలవేళ ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో ఉమాదేవి, ప్రవీణ్, ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.

## నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు



ర్యాలీలో పాల్గొన్న వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
ప్రస్తుతం జరుగుతున్న స్థానిక ఎన్నికల్లో నర్సాపూర్ మండల పరిధిలోని కాగజ్‌మద్దూర్ గ్రామపంచాయతీ ఎన్నికలలో బిజెపి పార్టీ తరపున సర్పంచ్‌గా పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి నర్సగోని సంతోష ఆంజనేయులు నామినేషన్ వేయడానికి వెళుతున్న ర్యాలీలో బిజెపి పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి బిజెపి సర్పంచ్ అభ్యర్థి నర్సగోని సంతోష ఆంజనేయులుకు గ్రామప్రజలంతా మద్దతుపలికి గెలిపించాలని రాధామల్లేష్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో మండల బిజెవైఎం అధ్యక్షులు అనిల్, నర్సాపూర్ పట్టణ ప్రధాన కార్యదర్శులు బోర్వెల్ రాంరెడ్డి, సంఘసాని రాజు, బిజెపి నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## పంటల వరికొయ్యల అవశేషాలను కాల్చవద్దు

**-మండల వ్యవసాయ అధికారిణి దీపిక**



పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిణి దీపికతోపాటు రైతులు

**నర్సాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
రైతులు వరిపంటల కోతలు అయిన తదుపరి వరిపంటల అవశేషాలను కాల్చవద్దని నర్సాపూర్ మండల వ్యవసాయ అధికారిణి దీపిక రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో వరి కోత అయిన పంటపొలాలను ఎఈఓ లక్ష్మి, రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరిపంట అవశేషాలను కాల్చకుండా ఎస్ఎస్‌పితోపాటు యూరియాను ఉపయోగించి డీకంపోస్ చేయాలన్నారు. దీంతో పంటభూముల్లో మట్టి ఆరోగ్యవంతంగా ఉండటమే కాకుండా పర్యావరణాన్ని కాపాడుతుందన్నారు. అంతేగాక రాబోయే పంటలో అధిక దిగుబడి వస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి దీపికతోపాటు ఎఈఓ లక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జెఎసి నేతలను పోలీసుస్టేషన్‌కు తరలింపు

**బేగంపేట, డిశంబరు 5, ప్రభాతవార్త**
బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరాచారి గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈశ్వరాచారి గాయపడిన విషయం తెల్సుకున్న బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితర బిసి నాయకులు శుక్రవారం గాంధీ ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తుండటంతో పోలీసులు వారిని రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరాచారికి మద్దతుగా ఉదయం నుంచి గాంధీ ఆస్పత్రి వద్ద బిసి నాయకులు సంఘీభావంగా ఆందోళన నిర్వహించారు. అతని మరణవార్త తెల్సుకున్న వందలాదిమంది బిసి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున గాంధీ వద్దకు చేరుకోవడంతో పోలీసులు వారిని అరెస్ట్‌చేసి రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జా కృష్ణ, విక్రమ్‌గౌడ్, గణేష్‌చారి, హరిశంకర్‌గౌడ్, పల్లె రవి కుమార్, మణిమంజరి, తదితర బిసి సంఘాల నాయకులు ఉన్నారు. అనంతరం వారిని పోలీసులు విడిచిపెట్టారు.

## 7న నగరానికి రానున్న దీదీ కృష్ణకుమారి

**హైదరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
మానవతావాది, ఆధ్యాత్మిక నాయకురాలు దీదీ కృష్ణకుమారి ఈనెల 7వ తేదీన నగరాన్ని సందర్శించనున్నారు. ఆదివారం సాయంత్రం 5:30 నుండి 7:30 వరకు సికింద్రాబాద్ సిక్ విలేజ్‌లోగల ఇంపీరియల్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీదీ కృష్ణకుమారి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రవేశం ఉచితమని, ఆసక్తి కలిగిన వారు సంస్థ క్యూర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాధు వాస్వానీ మిషన్ ట్రస్టీలు డాక్టర్ హరీష్ మీర్ చందని, హీరా రూపానీలు కాచిగూడ వారి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, నిపుణులు, గృహిణులు, విద్యావేత్తలు, ఆధ్యాత్మిక ఆకాంక్షకులు, విస్తృతసమాజంలోని ఇతరసభ్యులందరినీ ఆకర్షిస్తుందని భావిస్తున్నామన్నారు. ప్రతి వ్యక్తి, నేపథ్యం, పరిస్థితితో సంబంధం లేకుండా, అంతర్గత అవగాహన, ఆత్మవిశ్వాసం, క్షమ, కరుణతో కూడిన జీవనం ద్వారా వారి విధిని ఎలా పునర్ రూపకల్పన చేసుకోవాలనే అంశాలపై దీదీ కృష్ణకుమారి తన ప్రసంగంలో తెలియజేస్తారని వారు వివరించారు.

ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించే ఈకార్యక్రమంలో సభికుల ఎంపికలు, ఆలోచనలు, అంతర్గత వైఖరులు వారి జీవితగమనాన్ని ఎలా రూపొందిస్తాయో అన్వేషించడానికి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. ప్రజలందరి జీవితాల పట్ల గౌరవం, అహింస, సేవ, క్షమాపణ, మత సామరస్యం, క్షమాపణ, శాంతి, కరుణ కోసం ప్రపంచ ప్రచారం దీదీ కృష్ణకుమారి లక్ష్యమని వారు వివరించారు.

## బ్యాంకుల విలీనం వల్ల ప్రయోజనం లేదు : విఎస్ బోస్

**సైఫాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
దేశంలో బ్యాంకులు విలీనం చేయడం వల్ల ప్రజలకు జరిగే మేలు, లాభం చెప్పకుండా బ్యాంకులను విలీనంచేసి 4 పెద్దబ్యాంకులుగా మార్చి ప్రపంచంలో ఇతర దేశాలతో పోటీపడతానని చెప్పడం ప్రధాని నరేంద్రమోదీ మోసపూరిత వ్యాఖ్యలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ విమర్శించారు. కార్పొరేట్ సంస్థల పరపతి, అవకాశాలు పెంచడానికి వారికి అనుకూలంగా బ్యాంకులు పనిచేసేలా చేయడమే మోదీ ప్రధాన ఉద్దేశమన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. 4 పెద్ద బ్యాంకులు ఏర్పాటు చేయడం మూలంగా ప్రజలు దాచుకున్న డబ్బులకు వడ్డీ పెరుగుతుందా? లేక కార్పొరేట్ సంస్థలు ఒకేసారి వారికి కావాల్సిన అధిక మొత్తంలో అప్పు లభించే సౌలభ్యం ఈ పెద్దబ్యాంకుల ద్వారా వస్తుందన్న విషయాన్ని మోదీ తెలియజేయాలని డిమాండ్ చేశారు. 4 పెద్దబ్యాంకుల ఏర్పాటు పేరుతో అన్ని బ్యాంకుల విలీనం చేయడం దేశ ఆర్థికవ్యవస్థకు నష్టదాయకమన్నారు. 4 పెద్ద బ్యాంకుల ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకపోతే ప్రజలు మోదీకి తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.

## తక్షణమే తెలంగాణ ప్రజలకు పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

**సైఫాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ వారి కనుదృష్టి తగిలిందని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అవాకులుచవాకులు పేలడాన్ని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) తెలుగురాష్ట్రాల చీఫ్ కో–ఆర్డినేటర్ టి.పద్మారావు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాదారం వినయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు.

తక్షణమే పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలు రెండు తెలుగురాష్ట్రాల ప్రజలమధ్య వైషమ్యాలు రేపేవిధంగా ఉన్నాయని, అంతేకాకుండా రెండురాష్ట్రాలలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాఖ్యలు అతని అవగాహనారాహిత్యానికి, మూర్ఖత్వానికి నిదర్శనమని, రాష్ట్రంలో తాను ఉంటున్నానని, ప్రభుత్వంలో కూడా భాగస్వామినని చెప్పుకోవడానికి, తన ఉనికిని చాటుకోవడానికి అప్పుడప్పుడు ప్రత్యేకంగా విమానాల్లో తిరగడానికి, తన లక్ష పుస్తకాల అజ్ఞానాన్ని ప్రదర్శించుకోవాలనుకుంటే ప్రదర్శించుకోవచ్చునని, అంతేకాని ఈవిధమైన వ్యాఖ్యలు చేయడం తెలుగు రాష్ట్రాల ప్రజల మనోభావాలు కించపరిచేలా చేయరాదని వారు హెచ్చరించారు. తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

## తంజావూరు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో వర్క్‌షాప్ ప్రారంభం

**సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త:**
హిమాయత్‌నగర్‌లోని సిరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా తంజావూరు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ శుక్రవారం ఉదయం ప్రారంభోత్సవం జరిగింది. ఈ వర్క్‌షాప్‌ను ఫెడ్లయిట్ కంపెనీ నిపుణురాలు ఇందిరా, సీనియర్ పెయింటింగ్ ఆర్టిస్ట్ శ్రీపతి జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్ డైరెక్టర్ స్వామి మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఔత్సాహికులకు ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. తమ వర్క్‌షాప్‌లో శిక్షణపొందిన మహిళలు సొంతంగా పెయింటింగ్ వేసుకుంటున్నారని, ఆనేకమంది స్వయంగా పెయింటింగ్ సెంటర్‌లను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ప్రముఖ పెయింటింగ్ ఆర్టిస్టులచే ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. శనివారం కూడా వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు.

## విద్యార్థి దశ నుంచే చురుకుగా ఉండాలి

**అఫ్జల్‌గంజ్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
నగరంలోని వేర్వేరు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 174మంది విద్యార్థులు పాల్గొనగా, అందులో అఫ్జల్‌గంజ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శృజన్‌కుమార్ సొంతంగా తాళంలేకుండా తలుపు తెరవడానికి ఫుట్ ఫెడల్ పరికరంతో తలుపును తయారుచేశాడు. 18మంది విజేతలను ఎంపిక చేయగా అందులో అఫ్జల్‌గంజ్ ఉన్నత పాఠశాలకు చెందిన శృజన్‌కుమార్‌ను సైన్స్ ఉపాధ్యాయులు బల్వంత్‌రెడ్డి అభినందించారు. ఆయన చేతులమీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారు. విద్యార్థులు పలు అంశాల్లో వివిధ రకాలైన సమూనాలను రాష్ట్రస్థాయి పోటీలకు, జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.

## విహెచ్‌ను సన్మానించిన కార్పొరేటర్ రాజ్‌మోహన్

**బేగంబజార్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
ప్రభుత్వం అమలు చేసే అన్ని ఆర్థిక విధానాల అంతిమ లక్ష్యం మానవవాభివృద్ధియే దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజెట్టి రోశయ్య ఆలోచనని మాజీ రాజ్యసభ్యులు వి.హనుమంత్‌రావు అన్నారు. కొటిజెటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోమాజీ రాజ్యసభ సభ్యులు వి.హన్‌మంత్‌రావును సన్మానించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన

**చిక్కడపల్లి, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
రైతువ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మోడీ సర్కార్ అవలంబిస్తున్న రైతువ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్యక్రమం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం మాట్లాడుతూ శీతాకాల పార్లమెంట్ సమావేశల్లో పత్తి విత్తనచట్టాన్ని అమోదించడానికి మోడీ సర్కార్ కుట్రలు చేస్తుందని, ఈ చట్టం కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూరే విధంగా, రైతాంగానికి నష్టం కలిగించే విధంగా ఉందని విమర్శించారు. ఇప్పటికే వ్యవసాయరంగంలో కార్పొరేట్ సంస్థలైన మోనోశాంటో, సిజెంటా, టాటా తదితరుల ప్రవేశంవల్ల కల్తీవిత్తనాలు పెరిగిపోయాయని, పత్తివిత్తనచట్టంలో నకిలీ విత్తనాల తయారీదారులపై ఎలాంటి చర్యలు ఉండబోవని, రైతులు నేటికీ కల్తీ విత్తనాల వల్ల ఆర్థిక బాధలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. పత్తి విత్తనాల చట్టం, విద్యుత్ బిల్లుల సవరణకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు 8న పత్తివిత్తనచట్టం, విద్యుత్ సవరణలచట్టం ప్రతుల దగ్ధం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర కోశాదికారి జి.వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, మండల యుగేందర్, బి.సత్తెన్న, బోనాల స్వామి, చంద్రం, రామచంద్రన్న పాల్గొన్నారు.

## దోపిడి కేసులో నలుగురు అరెస్ట్...

**-రూ.34,లక్షలు స్వాధీనం**

**చార్మినార్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
హైదరాబాద్ పాతనగరంలో ఓ గాజుల వ్యాపారిని కత్తితో బెదిరించి నలభై లక్షల రూపాయలను దోచుకెళ్లిన కేసులో భవానీనగర్ పోలీసులు శుక్రవారం నలుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద 34,66,000 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీర్‌చౌక్ ఏసిపి శ్యామ్ సుందర్ భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామితో కలిసి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సుల్తాన్ బతుకుతెరువు కోసం హైదరాబాద్ పాతబస్తీవచ్చి తలాబ్‌కట్టలో స్థిరపడ్డాడు. సుల్తాన్ తలాబ్‌కట్టలో గాజుల వ్యాపారం చేస్తున్నాడు. కాగా గాజుల వ్యాపారి సుల్తాన్ పాతబస్తీలో ఇల్లు ఖరీదు చేయాలన్న ఉద్దేశ్యంతో బీహార్‌లో ఉన్న భూమిని 40లక్షల రూపాయలకు విక్రయించాడు. నలభై లక్షల రూపాయలను తలాబ్‌కట్టలోని తాను నివాసం ఉంటున్న ఇంట్లోని డ్రమ్‌లో దాచాడు. కాగా సుల్తాన్ ఇల్లు ఖరీదు చేస్తున్న విషయాన్ని బీహార్‌కు చెందిన గాజుల వ్యాపారి తలాబ్‌కట్టలో ఉంటున్న మహ్మద్ జాహిద్‌కు తెలిపాడు. మహ్మద్ జాహిద్ సుల్తాన్ ఇంట్లో ఉన్న డబ్బును దొంగలించాలని పథకం వేశాడు. ఈ విషయాన్ని జాహిద్ తలాబ్‌కట్టకు చెందిన కారు డ్రైవర్ సయ్యద్ ఇక్బాల్ (30)కు తెలిపాడు. గత నెల 30వ తేదీ ఆదివారం ఉదయం ఐదుగంటల సమయంలో సయ్యద్ ఇర్ఫాన్, తలాబ్‌కట్టకు చెందిన రాఫిడ్ డ్రైవర్ ముదాసీర్ అలాహి (19) కలిసి ముఖాలకు మాస్కులు ధరించి గాజుల వ్యాపారి ఇంటికి వచ్చారు. సుల్తాన్ తలుపులు తీయగానే ఇంట్లోకి ప్రవేశించి గాజుల వ్యాపారి సుల్తాన్ నోరుమూసి, కత్తి పిడితో దాడిచేసి బెదిరించారు. ఇంట్లోని డ్రమ్ములో ఉంచిన నలభై లక్షల రూపాయలను తీసుకుని పారిపోయారు. సయ్యద్ ఇర్ఫాన్, ముదాసీర్ అలాహితోపాటు మహ్మద్ జాహిద్, బండ్లగూడకు చెందిన మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్‌లు కలిసి నలభై లక్షల రూపాయలను పంచుకున్నారు. సుల్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేశారు. సుల్తాన్ ఇంట్లోని నలభై లక్షల రూపాయలను దోపిడీ చేసినట్లు వారు అంగీకరించారు. సయ్యద్ ఇర్ఫాన్, ముదాసీర్ అలీహి, మహ్మద్ జాహిద్(37), మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్ (25)లను పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి 34,66,000 రూపాయలతోపాటు కత్తి, సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. ఈ కేసును భవానీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సాయి ఈశ్వర్‌కు నివాళులర్పించిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

**జగద్గిరిగుట్ట, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
బిసిలకు రిజర్వేషన్లలో అన్యాయం జరిగిందంటూ తీన్మార్ మల్లన్న కార్యాలయం ముందు జగద్గిరిగుట్ట డివిజన్ బీరప్పనగర్‌కు చెందిన సాయి ఈశ్వర్‌చారి (30) గురువారం ఒంటిపై పెట్రోల్ పోసుకొని కాల్చుకోవడం జరిగింది. వెంటనే అతన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందిన సాయి ఈశ్వర్‌చారిని శుక్రవారం తన స్వస్థలం జగద్గిరిగుట్ట బీరప్పనగర్‌కు తీసుకురావడంతో టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే కెపి వివేకానంద, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఈశ్వర్‌చారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి సాయిచారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

**పేట్‌బషీరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హేమంత్ గోకం(21) బహదూర్‌పల్లి, సిఎంఆర్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గురువారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో తన స్కూటీపై బహదూరల్లి నుండి కొంపల్లికి వెళ్తుండగా ఫారెస్ట్ అకాడమీ సమీపంలో వెనక నుండి థార్ వెహికల్ ఢీ కొట్టడంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 11:30 గంటల సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## వ్యక్తికి గుండెపోటు..

**-సిపిఆర్ చేసి రక్షి      ంచిన ట్రాఫిక్ సిబ్బంది**

**జీడిమెట్ల, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
జీడిమెట్ల సూరారం సిగ్నల్ వద్ద రహీం అనే వ్యక్తికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసు స్టేషనుకు చెందిన ట్రాఫిక్ మార్షల్ శివకుమార్ సిపిఆర్ చేసి రహీం ప్రాణాలను రక్షించారు. అనంతరం తానే స్వయంగా పక్కనే ఉన్న మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి సిపిఆర్ చేసిన శివకుమార్‌ను పలువురు అభినందించారు.

## బస్సులలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురి అరెస్ట్

**ఉప్పల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను ఉప్పల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. డిఐ వై.రామలింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్, బంజారాకాలనీకిచెందిన దాసర్ల యాదగిరి(24), చిలుకానగర్ శివాలయంవద్ద ఉండే కొమ్ము ప్రశాంత్(25), లెప్రసీకాలనీ, ముత్యాలమ్మ దేవాలయంవద్ద ఉండే పాశం యాదగిరి(23), ఆదర్శనగర్‌లో నివసించే బండారి సాంబరాజు(25), చంద్రపురికాలనీకి చెందిన మబ్బు రాజు(25)లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. రద్దీగా ఉండే బస్సులను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్నట్లు తెలిపారు. ఇదేక్రమంలో గత నెల 2వ తేదీన సికింద్రాబాద్ నుంచి ఉప్పల్‌కు వస్తున్న సేనారామ్ అనేవ్యక్తి బ్యాగ్ జిప్‌తొలగించి అందులో ఉన్న ఆరుతులాల బంగారం, 87తులాల వెండి చోరీ చేసినట్లు తెలిపారు. దీంతో పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా విచారణజరిపి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళలను ఢీ కొట్టిన ప్రైవేట్ బస్సు

**జీడిమెట్ల, డిసెంబర్ 5, ప్రభాతవార్త**
దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి గండి మైసమ్మ సిగ్నల్ వద్ద టూవీలర్‌పై వెళ్తున్న మహిళలను ప్రైవేట్ బస్సు ఢీ కొట్టింది. బస్సు డ్రైవర్ గమనించకుండా అలాగే ముందుకు వెళుతూ ఉండడంతో, సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ వెంటనే గమనించి బస్సు ఆపడంతో మహిళ స్వల్పగాయాలతో బయటపడింది. తక్షణమే ట్రాఫిక్ పోలీస్ 108కు ఫోన్‌చేసి, గాయపడ్డ మహిళ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మహిళను ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీస్ పనితీరుపై, స్థానికులు, పలువురు వాహనదారులు అభినందించారు.


గంగా భవాని దేవాలయంలో పూజులు చేస్తున్న హరీష్‌రావు

## కెసిఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉచిత చేప పిల్లల పంపిణీ : ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
కెసిఆర్ ప్రభుత్వం హయాంలో కాళేశ్వరం నీళ్ల వచ్చి బంగారంలాంటి చేపల పంట పండడంతో గంగాపుత్రులు ఎంతో సంతోషంగా ఉన్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు సమీపంలోగల గంగాభవాని ఆలయ వార్షికోత్సంలో శుక్ర వారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లా డారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేశామని సిద్దిపేట చేపలు కలకత్తా వరకు వెళ్ళాయని గుర్తు చేశారు. రాష్ట్రానికే ఆదర్శంగా సిద్దిపేటలో ఫిష్ మార్కెట్ నిర్మించుకున్నామన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని అన్ని చెరువులను ఎంతో అద్బుతంగా అభివృద్ధి చేసు కున్నామన్నారు. గంగాభవాని దేవాలయాన్ని ఎంతో అభివృద్ధి చేసుకోవడం తో పాటు ఫంక్షన్ హాల్ నిర్మించుకున్నామన్నారు. గంగా భవాని అమ్మవారి దయతో అందరికీ అన్నింటా శుభం చేకూరాలన్నారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొండం సంపత్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, గంగాపుత్ర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి రాజీనామా : మాజీ సర్పంచ్


మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చింతమడక గ్రామానికిచెందిన మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బిఆర్ఎస్ పార్టీలో ఉన్న తాను రెండేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరానని ప్రస్తుతం వ్యక్తిగత కారణాలతో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులతో చర్చించి భవిష్యత్‌లో ఏ పార్టీలో చేరేది ప్రకటి స్తానని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల శేఖర్, గ్రామస్తులు ఆకుల వెంకట్‌గౌడ్, చెప్యాల లక్ష్మణ్, బాలరాజు, నగేష్ పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎస్‌సిఆర్ జిఎం


స్వామి వారి చిత్ర పటాన్ని అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబరు 5, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఆలయ అధికారులు,అర్చకులు దేవాలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యతను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీవాత్సవ్‌కు ఈవో వెంకటేశం స్వామివారి చిత్రపటం అందజేయగా అర్చ కులు వేదమంత్రోచ్చరణలతో ఆశీర్వచనంచేసి తీర్థప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## సొంత గూటికి చేరిన మాజీ ఎంపిటిసి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీష్‌రావు

సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని వెల్కటూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి నర్సింలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సమక్షంలో శుక్రవారం తిరిగి బిఆర్ఎస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నర్సింలుకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతంకు గ్రామంలో ఐక్యతతో కలిసకట్టుగా పని చేయాలని హరీష్‌రావు సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ

**కొండపాక, డిసెంబరు 5, ప్రభాతవార్త :** ముగిసిన మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ పత్రాల స్వీకరణ పర్వం. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం మూడవ రోజుతో ప్రశాంతంగా ముగిసింది. కొండపాక మండల పరిధిలో 15 గ్రామ పంచాయతిలకు, 146 వార్డు సభ్యుల నామినేషన్ పత్రాల స్వీకరణకు 5 క్లస్టర్లను, కుకునూరుపల్లి మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతిలకు, 120 వార్డు సభ్యుల ఎన్నిక కోసం నామినేషన్ పత్రాలను స్వీకరించడానికి 4 క్లస్టర్లను అధికారులు ఏర్పాటు చేశారు. మొతానికి నామినేషన్ల ప్రక్రియ రెండు మండలాల్లో ప్రశాంతంగా ముగిసింది. క్లస్టర్ సెంటర్ల వద్ద అధికారులు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ఫ్యాక్ట్‌సెట్ సిఎస్‌ఆర్ నిధులతో మెల్లచెరువులో ఫ్లోటింగ్ వెట్‌లాండ్

**రామచంద్రాపురం, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఫ్యాక్ట్‌సెట్ సీఎస్ఆర్ నిధలతో వేదాంశి ఫౌండేషన్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ మెల్ల చెరువులో ఫ్లోటింగ్ వెట్లాండ్‌ను ఏర్పాటు చేశారు. కాలుష్య నియంత్రణలో అత్యంత ప్రభావవంతంగా పనిచేసేకన్నా ఇండికా మొక్కలను ఈ ఫ్లోటింగ్ వెట్లాడ్స్‌లో ఉపయోగించారు. బలమైన వేర్లు, మెటల్స్, పోషకాలు శోషించే సామర్థ్యం, నీటి శుద్దికి సహకరించే సూక్ష్మజీవుల పెరుగుదలకు అనుకూలంగా ఉండే లక్షణాలతో ఈ మొక్క నీటి కాలుష్యాన్ని తగ్గిండంలో కీలక పత్ర పోషిస్తుంది. తెల్లాపూర్ నీఇ సంఘం అధ్యక్షుఉలు వడ్డే నర్సింహులు మాట్లాడుతూ గతంలో పలు మార్లు వివిధ మార్గాల ద్వార కలుషితమైన ఈ చెరువు శుద్దికి ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్ట్సెట్ ఉద్యోగులు,తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమరెడ్డి, బిఆర్ఎస్ నేతలు శ్రీశైలం యాదవ్, ఉమేష్, శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు పవని, సిపి రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ ఈశ్వర తదితరులు పాల్గొన్నారు.

# ఓటు వేయండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

### డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్


ఓటు హక్కు ప్రచారోద్యంలో మాట్లాడుతున్న శంకర్

**గజ్వేల్, డిసెంబరు 5 (ప్రభాతవార్త):**
రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమికహక్కు ఓటు అని, ప్రజాస్వామ్యం పరిరక్షించాలన్నా, రాజ్యాంగ విలువలు కాపాడాలన్నా, సరైన నాయకులను ఎన్నుకొని భవిష్యత్తు తీర్చిదిద్దుకునే శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు అని, ప్రతి ఒక్కరు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన ఓటు హక్కు ప్రచారోద్యమంలో వారు మాట్లాడుతూ 18 సంవ త్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, విధిగా ఓటింగ్‌లో పాల్గొనాలని తెలిపారు. ప్రపంచ గతిని మార్చగల శక్తి ఒక్క ఓటుకే ఉందన్నారు. అలాంటి ఆయుధాన్ని వృధా చేసుకోకుండా, ప్రలో భాలకు గురికాకుండా, అమ్ముకోకుండా ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు ఓటును వినియోగించుకొని సరైన నాయకున్ని ఎన్నుకున్నప్పుడే రాజ్యాంగ రచయిత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ ఆశయాలు, ఆయన కన్నకలలు నెర వేరుతాయన్నారు. పురుషులతో పాటు మహిళలు సమాన ఓటు హక్కును కల్పించిన మహా నేత అంబేద్కర్ అన్నారు. బానిసలుగా బతుకుతున్న అంటరానివాళ్ల విముక్తి కోసం ఎస్సీ, ఎస్టీ, బిసి లకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. ఈ కార్య క్రమంలో దళిత ఉద్యోగుల ఐక్య వేదిక నాయకులు పంబాల ఎల్లయ్య, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.


ఓటు చోరీ వ్యవహారంపై సంతకాలు సేకరిస్తున్న ఆంక్షరెడ్డి

## ఓటు చోరీపై సంతకాల సేకరణ

### -జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి

**గజ్వేల్, డిసెంబరు 5 (ప్రభాతవార్త):** ప్రధానమంత్రి నరేంద్రమోడి చేసిన ఓటు చోరీ వ్యవహారంపై శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని 6వ వార్డులో స్థానిక పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా తూంకుంట ఆంక్షరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి ఓటు చోరీ వల్లే పలు రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. ఓటు చోరీతో పాటు ఈవిఎంలను టాంపరింగ్ చేశారని, రాజ్యాంగం ఇచ్చిన హక్కు ప్రకారం ఒకరికి ఒక్క ఓటు మాత్రమే ఉండాలని, అలాంటిది గుజరాత్ రాష్ట్రం లో విచ్చలవిడిగా దొంగ ఓట్లను తయారుచేశారన్నారు. ఓటు చోరీపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకే సంతకాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ డాక్టర్ వాహిద్, తంజుముల్ మజీద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతీన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మాజీ అధ్యక్షుడు సమీర్, జహీర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, కాంగ్రెస్ నాయకులు మన్నె అరుణ్, పూజారి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామశాస్త్రికి చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారం

**నాంపల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త :** ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ రసరం జని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సుప్రసిద్ధ రంగస్థలప్రయోక్త డా. చాట్ల శ్రీరాములు 94వ జయంతి వేడుకలను ప్రముఖ రంగస్థల నటుడు ఎన్.ఎస్.రామశాస్త్రికి చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కా రాన్ని ప్రదానం చేశారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వ విద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళా వేదికలో శుక్రవారం రాత్రి తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్ర నాటక కళాపరిషత్ అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ఆత్మీయ అతిథులు ప్రముఖ రంగస్థల ప్రయోక్త, దర్శకుడు డిఎస్ఎన్. మూర్తి, డి.విజయభాస్కర్, చాట్ల వెంకటరమణతో కలిసి రామశాస్త్రి దంప తులను సత్కరించి ప్రతిభా పురస్కారం, రూ.20 వేల నగదు బహుమతిని ప్రదానం చేశారు. నాటకమే తపస్సుగా భావించే నాటకరంగ నిత్యసత్య కృషీ వలులకు చంద్రుడికో నూలుపోగుగా సత్కారంచేసి గౌరవించాలన్న సంకల్పం తోనే ఆవిర్భవించిన చాట్ల శ్రీరాములు ట్రస్టు 1999 ప్రతీ ఏటా డిసెంబరు 5న ఒక నాటకరంగం విశిష్టునకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నారు.


మాట్లాడుతున్న కళ్యాణ్‌కార్ నర్సింగరావు

## బిసి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

### -బిసి నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు

**గజ్వేల్, డిసెంబరు 5 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం బిసి డిక్లరేషన్ వ్యవహారాన్ని కాలయాపన చేయడంతో మరొక వ్యక్తి ఆత్మహత్యాయత్నంకు పాల్పడినట్లు బిసి నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు ప్రభుత్వంపై మండి పడ్డారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ పేరు చెప్పి బిసిలను మోసం చేశారన్నారు. బిసిలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని గమనించిన ఈశ్వరసాయిచారి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నంకు పాల్పడడం బాధాకరమన్నారు. గాంధీ ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న మన బిసి బిడ్డకు ఏమైనా జరిగితే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. బిసి రిజర్వేషన్లు కూడా సాధించుకుందాం కానీ ఎవరూ అధైర్యపడవద్దని, ఆత్మహత్యలు చేసుకోవడం మంచిపద్దతి కాదని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి బిసి రిజర్వేషన్‌ను సాధిద్దామని అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే పార్టీలను బొంద పెడితే తప్ప బిసి రిజర్వేషన్ సాధ్యం కాదన్నారు. ఈశ్వరసాయిచారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ ఎల్ల వెంకటేశ్, కళ్యాణ్‌కార్ శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సాయి ఈశ్వరచారి మృతి కలచివేసింది

### -మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

**పుల్‌కల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పోచారం గ్రామానికి చెందిన సాయి ఈశ్వరచారి మృతి కలచివేసిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ విచారం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ ప్రగల్బాలు పలికిన సిఎం రేవంత్‌రెడ్డి ఆశపెట్టి మొండి చేయి చూపడంతో అసహనానికి గురైన బీసీ యువకుడు సాయి ఈశ్వరచారి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. సాయి ఈశ్వరచారి మృతి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన హత్యగా ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బిసిలకు ఇచ్చిన హామిని నెరవేర్చాలని క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు. సాయి ఈశ్వరచారి మృతి పట్ల కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే సానుభూతి ప్రకటించారు.

# నల్లకుంట చెరువు కాలుష్యంపై కెవిపిసి ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం

**గుమ్మడిదల డిసెంబరు 5 ప్రభాతవార్త :**
గుమ్మడిదల మండలం, దోమడుగు గ్రామంలోని నల్లకుంట చెరువు కాలుష్యంపై కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ (కెవిపిసి) ఆధ్వర్యంలో గ్రామస్థులు పోరాటాన్ని ఉధృతం చేశారు. దోమడుగు గ్రామ ప్రజలు మెమొరాండాన్ని ప్రజాభవన్‌లో శుక్రవారం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఇన్‌ఛార్జి అధికారి చిన్నరెడ్డి మెమోరాండంను స్వీకరించి, సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, తదుపరి చర్యల కోసం దానిని తక్షణమే కాలుష్య నియం త్రణ మండలి మెంబర్ సెక్రటరీ ఎండార్స్ చేసి (పంపించి) ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లిన వెంటనే, దోమడుగు గ్రామ రైతులు ప్రధాన కార్యా లయం, సనత్‌నగర్ వద్దకువెళ్లి ఉన్నతాధికారులను కలిశారు.అక్కడి ఉన్నతాధికారి కె.ప్రసన్నరాణి, ఈ సమస్యను తదుపరి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ బోర్డు మీటింగ్‌లో చేర్చుతామని రొటీన్ సమాధా నం ఇచ్చారనీ వారు ఆవేదన వ్యక్తం చేశారు.గత నాలుగు నెలలుగా సమస్య పరిష్కారం కాకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులు, ముఖ్య మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లినప్పు టికీ, అదే ఉదాసీన వైఖరిని కొనసాగించడంపై గ్రామస్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు."మా పోరాటం ఆగదు! శాశ్వత పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుంది." అధికారుల నిర్లక్ష్య వైఖరిని, నాలుగు నెలలుగా కాలుష్యానికి కారణాన్ని తేల్చడంలో వారి వైఫల్యాన్ని ఖండిస్తూ, దోమడుగు గ్రామ రైతులు తక్షణమే ధర్నాకు పిలుపునిచ్చారు.ధర్నా డిసెంబర్ 12న నిర్వహణకు ఉద్యమకారులు వెంటనే ధర్నా నోటీసును కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో సమర్పించి, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. దోమడుగు ప్రజలు ఎదుర్కొంటున్న జీవన మరణ సమస్యపై ప్రభుత్వం,తక్షణమే స్పందించి, హెటెరో డ్రగ్స్ యూనిట్1 ను మూసివేయాలని, గ్రామంలో మానవ వైద్యశాల, పశువైద్యశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, జయమ్మ, మంగయ్య కన్వీనర్లు, కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ, దోమడుగు గ్రామం కమిటీ బాల్ రెడ్డి, మంగయ్య, ఆనందరెడ్డి, మహిపాల్‌రెడ్డి, మోహనరెడ్డి, జయమ్మ, అఖిల, అనసూయ, సులోచన, లావణ్య,మమతా వై. అశోక్ కుమార్, చైర్మన్, టిపిజెఏసి సంగారెడ్డి జిల్లానాయకులు ఆర్.లక్ష్మి, మానస, అధిక సంఖ్య లో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌ఛార్జి అధికారి చిన్నరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దోమడుగు గ్రామస్తుల దృశ్యం

# సాంకేతిక నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన

**చౌటకూరు, డిసెంబరు 5, ప్రభాతవార్త:**
ఆధునిక తయారీ సాంకేతికలలో పరిశ్రమ నిపు ణుల నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జేఎన్టీ యూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూ హెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎంఎస్ ఎఈ-డీఎఫ్‌వో హైద్రాబాద్ ఆధ్వర్యంలో జేఎన్టీ యూహెచ్- టీబీఐ సహకారంతో టెక్నాలజీ భాగ స్వామ్య సంస్థ ఇనిక్సస్ 3 డీ మద్దతుతో ఆరు వారాల పాటు నిర్వహించనున్న ఎంఎస్ఎంఈ- ఈఎస్‌డీపీ ఆన్ యాడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ 3డీ ప్రింటింగ్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల నేప థ్యంలో నైపుణ్యాభివృద్ది ఎంతగానో దోహదపడు తుందన్నారు. ఎంఎస్ఎంఈ-డీఎఫ్‌వో అసిస్టెంట్ డైరెక్టర్ జీఎస్ బిస్త్ శిక్షణ కార్యక్రమాల లక్ష్యాలు, పరిశ్రమలకు అందచేస్తున్న ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. సంగారెడ్డి జిల్లా పరి శ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సుమన ప్రియాంక ప్రభుత్వ పరిశ్రమల అభివృద్ది పథకాలు నిధుల అవకాశాలను వివరిస్తూ గరిష్ట ప్రయోజ నాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో టీబీఐ డైరెక్టర్ ఎం ఆశారాణి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ విశ్వనాథరాజు, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, మెకానికల్ హెచ్‌వోడీ శైలజ, రజనేష్ తదితరులు పాల్గొన్నారు.


ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు

### ప్రభుత్వ ఉద్యోగం వదిలి ప్రజాసేవ కోసం

## సర్పంచు పదవికి నామినేషన్ వేసిన శిల్ప

**కొండపాక, డిసెంబరు 5, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగం వదులుకొని ప్రజాసేవ కోసం ముందుకొచ్చిన చిక్కుడు (చింతల) శిల్పనర్సింలు. గ్రామ అభివృద్ధి కోసం ఇజంనీరింగ్ చదివి కొన్ని సంవత్సరాల నుండి ఎంపిడిఓ,, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న అమె సర్పంచుగా గెలిచి గ్రామానికి సేవ చేయాలనే తపనతో ఉద్యోగానికి రాజీనామా చేసి మూడవ విడత సర్పంచు ఎన్నిక కోసం జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శుక్రవారం అమె కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారం గ్రామ సర్పంచు పదవి బిసి మహిలకు కేటాయించారు. దీంతో అమె సర్పంచు అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను మేదినిపూర్‌లో క్లస్టర్‌లో దాఖాలు చేశారు. గతకొన్ని సంవత్సరాల నుండి తన భర్త చిక్కుడు నర్సింలు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటు వైద్య సేవలందిస్తు అందరితో కలిసి మెలిసి ఉంటున్నాడు. తన భర్తతో కలిసి తాను సైతం గ్రామ ప్రజలకు సేవ చేస్తానని అమె ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికల బరిలో నిలిచారు.

## గ్రామాల్లో హోరెత్తుతున్న పంచాయతీ ప్రచారం

### -పోటీపడి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ మద్దతుదారులు


నామినేషన్ దాఖలు చేసేందుకు వెళుతున్న అభ్యర్థులు

**చౌటకూరు, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని 15 పంచాయతీలకు జరగనున్న ఎన్నికలను పురస్కరించుకుని అభ్యర్థులు పోటీ పడి ప్రచారం చేసుకుంటున్నారు. శనివారం నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఉండటంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మద్దతుదారులు పోటీ పోటీగా గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థులకు ఇంకా గుర్తింపులు కేటాయించకపోయినా తమకు మద్దతు పలకాలని గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంది. చౌటకూరులో కాంగ్రెస్ మద్దతుదారు పార్కల రాంరెడ్డి, బిఆర్ఎస్ మద్దతుదారు తుంగె నవనీత అనంతయ్య, కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి అందోల్ నాగరాణికృష్ణ, సరాఫ్‌పల్లిలో కాంగ్రెస్ మద్దతుదారు నందికంది నిర్మలరామచంద్రారెడ్డి, కోర్పోలులో బిజెపి మద్దతుదారు బచ్చు గూడెం సునీతప్రవీణ్‌రెడ్డి, శివంపేటలో స్వతంత్ర్య అభ్యర్థి అలీం, వెంది కోల్‌లో కాంగ్రెస్ మద్దతుదారు గిరంగారి మల్లారెడ్డి, బిఆర్ఎస్ మద్దతుదారు కల్వగూరి బసంత్‌రెడ్డి, బిజెబి అభ్యర్థినీరుడి ప్రవీణ్‌కుమార్‌లు గ్రామాల్లోని గడప గడపకు వెళుతూ మద్దతు పలకాలని అభ్యర్థిస్తున్నారు. నామినేషన్‌ల ఉపసంహరణకు ముందే గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది.

## యుపిఎస్ పాఠశాలలో మట్టి దినోత్సవం

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 5,ప్రభాతవార్త :** మండల పరిధిలోని నాంచార్‌పల్లి యుపిఎస్ పాఠశాలలో శుక్రవారం ప్రపంచ మట్టి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అధిక పెస్టిసైడ్‌లు వినియోగించడంతో వాతావరణం కాలుష్యం అయి భూమి సారం తగ్గిపోతుందని విద్యార్థులకు తెలిపారు. వాతావరణం కాలుష్యం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాతయుతంగా మెదలాలనని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీనివాస్, స్రవంతి, దేవరాజ్, మిత్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యునికి ఆర్థిక సహాయం అందజేత

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 5, ప్రభాతవార్త :** సిద్దిపేట కెసిఆర్ నగర్ లో నివాసముంటున్న పప్పుల వైకుంఠం పక్షవాతంతో బాధపడుతుండడం తో విషయం తెలుసుకున్న జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శుక్ర వారం బాధితునికి దాతల సహకారంతో రూ.31 వేల ఆర్థికసహాయాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్,ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు మంచాల శ్రీనివాస్ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యులను ఆదుకోవడానికి ఆర్యవైశ్య మహాసభ ఎప్పుడు ముందుంటుం దన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తుణుకు ఆంజనేయులు, కోశాధికారి డాక్టర్ మాంకాల నవీన్‌కుమార్, అదనపు కార్య దర్శి గంప కృష్ణమూర్తి, అయిత పురుషోత్తం, పొశెట్టి శ్రీకాంత్, పుల్లూరి శివకుమార్, అర్వపల్లి హరికిరణ్, నాగమణి, తడకమడ్ల శంకరయ్య, యాసాల వెంకటలింగం, నాగరాజు, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

### నూతన పద్ధతులను ఉపయోగించి

## పాఠ్యాంశాన్ని బోధించాలి : డిఇవో

**సదాశివపేట, డిసెంబరు 5 (ప్రభాతవార్త):** శుక్రవారం సదాశివపేటలో గల ప్రియదర్శిని స్పిన్నంగ్ మిల్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు సందర్శించారు. పాఠశాలలో ఉపా ధ్యాయులు పాఠ్యాంశాలను చెప్పే విధానాన్ని పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ లో భాగంగా ప్రతి తరగతిలోని విద్యార్థులు తెలుగు,ఇంగ్లీష్ చదివించాలని, గణితంలో చతుర్విధ ప్రక్రియలు తప్పకుండా అందరికీ రావాలని తెలిపారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించే క్రమంలో టిఎల్ఎం, నూతన పద్ధతు ల్లో బోధిస్తే విద్యార్థులు ఎక్కువ కాలం గుర్తుంచుకుంటారని తెలిపారు. ఉపాధ్యాయుల తరగతివారీగా లైబ్రరీ పుస్తకాలు రిజిస్టర్, ఉపాధ్యాయుల మరియు తల్లిదండ్రుల సమావేశం మినిట్స్ పుస్తకం పరిశీలిచి, సరైన విధంగా లేవని ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగిందని, వాటిని సరి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎఓ వెంకటేశం పాల్గొన్నారు.

## కథల పోటీల్లో కొండపాకకు రాష్ట్రస్థాయి బహుమతి

**కొండపాక, డిసెంబరు 5, ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి సాహిత్య పోటీల్లో తృతీయ బహుమతిని గెలుచుకున్న కొండపాక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి టి.రిత్విక్‌తేజ. బాలలదినోత్సవం సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ వారు నిర్వహించిన కథల విభాగంలో 8వ తరగతి చుదువుతున్న రిత్విక్ ఎంపికైనట్లు హెచ్ఎం విఠల్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సాహిత్య అకాడమీ నిర్వహించినపోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రిత్విక్ తేజ రాష్ట్రస్థాయిలో బహుమతి అందుకొవడం పాఠశాలకు గర్వకా రణం అన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు సత్యలక్ష్మి సేవలను హెచ్ఎఉం, ఎఎంసి చైర్మన్, ఉపాధ్యాయుల బృదం ప్రశంసించినట్లు అయన తెలిపారు.

## ఎర్రవల్లిలో మట్టి ఆరోగ్య దినోత్సవం

**మర్కుక్, డిసెంబరు 5 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో మట్టి ఆరోగ్య దినోత్సవం, మహిళలపై డిజిటల్ హింస నివారణ కార్యక్రమంపై మారి-బిసిఐ సిద్దిపేట బృందం, సిద్దిపేట పోలీస్ శాఖ షీటీమ్స్ ఆధ్వర్యంలో రైతులకు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేలలో సేంద్రీయ కార్బన్ పెంపు, రసాయన ఎరువులు, అత్యంత ప్రమాదకర పురుగుమందుల వినియోగం తగ్గింపు, సేంద్రీయ ఎరువుల ప్రాధాన్యత, నేల నమూనా సేకరణ విధా నాలు, ఎరువుల వినియోగంపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కవిత రాంమోహన్‌రెడ్డి, మారి-బిసిఐ సిద్దిపేట సిబ్బంది మౌనిక, రమాదేవి, వెంకటేష్, దుబ్బాసి రమేష్, షీటీమ్ సభ్యులు ఆంజనేయులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.


ఎర్రవల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# సిఎంఆర్ డెలివరీలో అలసత్వం వద్దు

## -మెదక్ అదనపు కలెక్టర్ నగేష్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ డిసెంబరు 5, ప్రభాతవార్త ప్రతినిధి:** కస్టమ్ మిల్లింగ్ రైస్(సిఎంఆర్) డెలివరీ ప్రక్రియలో మిల్లర్లు అలసత్వం వీడాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, రైస్‌మిల్లర్లతో అదనపు కలెక్టర్ నగేష్ సమీక్షాసమావేశం నిర్వహించారు. ముందుగా మిల్లులవారీగా కేటాయించిన ధాన్యం ఇప్పటివరకు అప్పగించిన బియ్యం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రబి (యాసంగి) 2024-25 కోసం సమర్పించవలసిన సిఎంఆర్ బ్యాలెన్స్ బకాయిల విషయంలో, మెదక్ జిల్లా అధికారుల సమక్షంలో సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోబడ్డాయన్నారు.

బకాయిలు ఉన్న మిల్లర్లు తమకు కేటాయించిన రోజువారీ టార్గెట్లను తప్పనిసరిగా నిర్దిష్టంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. రోజువారీ లక్ష్యాలను పూర్తిచేయ నట్లయితే సంబంధిత మిల్లర్లు డిఫాల్ట్‌గా పరిగణించబడే ఆస్కారం ఉందని, అలాగే వారికి కేటాయించిన ధాన్యాన్ని ఇతర మిల్లులకు బదిలీ చేసే అవకాశం లేకపోలేదని, అదనంగా, సిఎంఆర్ స్వీక రణకు చివరి తేదీ 28.02.2026 మాత్రమే అని, ఈ గడువు అనంతరం ఏ విధమైన సిఎంఆర్ స్వీకరణ చేపట్టబడదని అధికారులచే స్పష్టంగా తెలియ జేయబడినది. సంబంధిత మిల్లర్లు గడువు ముగిసేలోపు తమ రోజువారీ టార్గెట్లను యథావిధిగా పూర్తిచేసి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

## ఘనంగా మాణిక్‌ప్రభు రథోత్సవం


మాణిక్‌ప్రభు రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

**సదాశివపేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మాణిక్‌ప్రభు మందిరం ఉత్సవాలలో భాగంగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గురుచరిత్ర సప్తాహము సమాప్తం, అనంతరం గోపాలకాల మాణిక్‌ప్రభు రథోత్సవం, మహాప్రసాద వినియోగం నిర్వహించబడింది. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు చిదానందం, ఓదెల మాణిక్‌రావు, వాదోని చంద్రశేఖర్, విజయకుమార్, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, మనోహర్, శ్రీధర్, ప్రభు, రఘు, వెంకటేశం, రాములు, ప్రభు, కృష్ణ పంతులు, వైద్యం పవన్, మురళి ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## హనుమాన్ మందిరంలో డోలారోహణం


హనుమాన్ మందిరంలో డోలారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

**సదాశివపేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:** దత్త జన్మదినోత్సవం సందర్భంగా లోపలకోట హనుమాన్ మందిరంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి డోలరోహణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈసందర్భంగా లోపలి కోట మహిళలు దత్తాత్రేయుని చిత్రపటాన్ని తొట్టెలలో వేసి భక్తిపాటలతో డోలారోహణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పోల నిర్మల, మధ్యల లక్ష్మి, మాధవి, లావణ్య, సుమిత్ర, రాధాబాయి, రోజా, సువర్ణ, అనసూయ, సోలాపురం అంజలి, గున్నాల వీణ లోపలికోట మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సిసిరోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ భూమిపూజ


సిసిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, డిసెంబరు 5, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని విడతలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్ప నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలోని 1,2 రోడ్డులో 32 లక్షలతో, తహసీల్దార్ కార్యాలయం నుంచి ట్రాన్స్‌ఫార్మర్ వరకు 30లక్షల రూపాయలతో నిర్మించే సిసిరోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డునిర్మాణం పనులు ప్రారంభించి కాలనీలో కార్పొరేటర్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ దివ్య, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్ రామ్‌రెడ్డి, రాజుగౌడ్, రమేష్, చక్రవర్తి, భాస్కర్, వేణుగోపాల్, లింగం, సుదర్శన్‌రెడ్డి, వీర్‌శెట్టి, గోవర్ధన్‌రెడ్డి, గణేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బర్దీపూర్‌లో నేత్రపర్వంగా పల్లకీసేవ



బర్దీపూర్‌లో దత్తాత్రేయ పల్లకీసేవ దృశ్యం

**ఝరాసంగం, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండలపరిధిలోని బర్దీపూర్‌లో దత్తజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలో పల్లకీసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. దత్తగిరి ఆశ్రమం నుంచి అందంగా ముస్తాబుచేసిన పల్లకీని గ్రామంలోని పురవీధులగుండా భజన, సంకీర్తనలు, మంగళవాయిద్యాలమధ్య శోభాయమానంగా నిర్వహించారు. కర్నాటకలోని బీదర్‌కు చెందిన విద్యార్థుల నృత్యాలు భక్తులను కనువిందు చేశాయి. పల్లకీసేవ వేడుకలో బర్దీపూర్ గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాలు, ఉమ్మడి మెదక్ జిల్లా వాసులు, కర్ణాటక, మహారాష్ట్ర వాసులు పాల్గొన్నారు.

## సర్పంచ్ అభ్యర్థిగా మధుర మణిరం


సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న మధుర మణిరం

**కంగ్టి, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాజారాంతండా పంచాయతీకి సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ మద్దతుదారు మధుర మణిరం శుక్రవారం తుర్కవాడగంలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రంలో తన మద్దతుదారులతో కలిసి నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి యశ్వంత్‌కు అందచేశారు. మండల కేంద్రమైన కంగ్టి పంచాయతీ అభ్యర్థిగా లొండే నర్సింలు, ముకుందా నాయక్‌తండాకు చెందిన ఆడే ప్రకాష్, మల్లేష్‌లు నామినేషన్‌లు వేశారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు తమ మద్దతుదారులతో నామినేషన్ కేంద్రం వరకు చేరుకుని ఎన్నికల అధికారులకు తమ నామినేషన్‌లు అందచేశారు.

## నందికందిలో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సదాశివపేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:** సదాశివపేట మండలంలోని నందికంది గ్రామంలో సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం బిఆర్ఎస్ బలపరచిన కుందెన కమలమ్మ తరపున సంగారెడ్డి శాసనసభ్యుడు చింతాప్రభాకర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ నందికంది గ్రామ సర్పంచ్‌గా కుందెన కమలమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఇంటింటి ప్రచారంలో మాజీ ఎంపిటిసిలు పేట జయశ్రీ, శ్రీనివాస్, సునీత, సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, వెల్టూరు మాజీ సర్పంచ్ పబ్బతి లక్ష్మారెడ్డి, నాయకులు వర్కల రాజు, రాజేందర్, కాంత రావు, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా విస్తృత ప్రచారం

### -గెలుపుపై ధీమా వ్యక్తంచేసిన చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**గుమ్మడిదల, డిసెంబరు 5, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి యాదగిరి యాదవ్‌కు మద్దతుగా రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలతో భేటీ అవుతూ మాట్లాడిన ఆయన, గ్రామ అభివృద్ధి కొనసాగాలంటే బిఆర్ఎస్ అభ్యర్థి యాదగిరియాదవ్‌ను గెలిపించి గ్రామానికి మరిన్ని నిధులు, పథకాలు రాబట్టేందుకు అవకాశం కల్పించాలని గ్రామ ప్రజలను కోరారు. వీరితోపాటు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, రాష్ట్ర నాయకులు వెంకటేశంగౌడ్, మాజీ జడ్పిటిసి కొలను బాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి కుమార్‌గౌడ్, మాణిక్‌యాదవ్, రాజేష్, నక్క వెంకటేష్‌గౌడ్, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ముద్రికచారి, విశాల్ గౌడ్, భార్గవ్‌చారి, నాగులు, వెంకటేష్, కాంతారావు, రాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాసర్ సర్పంచ్ అభ్యర్థిగా హనుమంతరావు


సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న హనుమంతరావు

**సిర్గాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వాసర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ మద్దతుదారు బిరాదర్ హనుమంతరావు శుక్రవారం నామినేషన్‌ను దాఖలు చేశారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతువేదికలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రంలో హనుమంతరావు తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందచేశారు.

## కొత్తపల్లి గ్రామంలో పంచాయతీ ఎన్నికలు

### -అత్తాకోడళ్ల మధ్య ఆసక్తికరమైన పోటీ..

**గుమ్మడిదల, డిసెంబరు 5, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీలో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారాయి. అత్త సూరారం మంజుల, కోడలు సూరారం రమ్యకృష్ణ ఎదురెదురుగా బరిలో దిగడంతో గ్రామంలో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. కుటుంబసభ్యుల మధ్యే పోటీ నెలకొనడంతో ఈ ఎన్నికలపై మొత్తం మండల దృష్టిపడింది. గ్రామం మొత్తం రెండువర్గాలుగా విడిపోయి ప్రచారం ఊపందుకుంది. తండ్రి పక్షం సీనియర్ నాయకత్వాన్ని, అనుభవాన్ని హైలైట్ చేస్తుండగా, కొడుకు యువతను ఆకట్టుకునేవిధంగా ఆధునిక అభివృద్ధి, పారదర్శకత పేరుతో ఓట్లకోసం చురుకుగా ప్రచారం కొనసాగిస్తున్నాడు. ప్రతి వీధి, ప్రతి గుమ్మంలో ఈపోటీ గురించే చర్చ. ఒకవైపు కుటుంబంలో రాజకీయ విభేదాలు బయటపడగా.. మరోవైపు గ్రామ ప్రజలు ఎవరు గ్రామాభివృద్ధికి మంచివారు అనే కోణంలో తర్జనభర్జనలు పడుతున్నారు. పోటీ తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో గెలుపు ఎవరిదో ఊహించడం కూడా కష్టంగామారింది. చివరిరోజుకు ఓటర్ల మూల్యాంకనం కీలకమవుతుందని నాయకులు భావిస్తున్నారు. కొత్తపల్లి పంచాయతీ ఫలితం ఈసారి కేవలం ఓటమి-విజయం మాత్రమే కాదు, అత్త-కోడలుమధ్య ప్రతిష్ఠాకరమైన పోరుగా మారిందనే మాట నిజం. గెలుపు కేవలం కొన్ని ఓట్ల అంతరంపైనే ఆధారపడి ఉండొచ్చని స్థానికులు అంటున్నారు. వీలైతే వీరి మధ్యలో పోటీ ఉండే మూడో వ్యక్తికి లాభం చేరేవిధంగా ఉన్నాయంటూ గ్రామస్థుల గుసగుసలు. ఏది ఏమైనా కొత్తపల్లి రాజకీయం ఈసారి రసవత్తరంగానే ఉందని చెప్పవచ్చు.

## మండలంలో కాంగ్రెస్ ప్రచార జోష్..

### -గ్రామాల్లో మోగుతున్న జై కాంగ్రెస్ నినాదాలు: పుట్ట నర్సింగరావు


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

**గుమ్మడిదల, డిసెంబరు 5, ప్రభాతవార్త:** గుమ్మడిదలమండలంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈసారి గ్రామాభివృద్ధి దిశగా ప్రజలకు నమ్మకం కలిగించే నాయకులను ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో కాంగ్రెస్‌పార్టీ శక్తిప్రదర్శన చేస్తోంది. కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా మండలపార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు స్వయంగా బరిలోకి దిగి ప్రచారాన్ని దుమ్ములేపుతున్నారు. నర్సింగరావు ఆధ్వర్యంలో గ్రామాలచుట్టూ తిరుగుతూ భారీప్రచారం అన్ని గ్రామాలు, అనంతరం, కానుకుంట, నల్లవల్లి, కొత్తపల్లి, వీరారెడ్డిపల్లి, రామిరెడ్డిబాయి, మంబాపూర్, నాగిరెడ్డిగూడెం గ్రామాలలో వరుసపర్యటనలు జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనడంతో ప్రచారం వేడెక్కింది. గ్రామ ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థుల అభివృద్ధి దృష్టిని నర్సింగరావు వివరించారు.

**గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. ఇక కాంగ్రెస్‌పాలన కావాలి -నర్సింగరావు వ్యాఖ్య**

పటాన్‌చెరు ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పుట్ట నర్సింగరావు ఇక ప్రజలప్రభుత్వం గ్రామాల్లో నిలవాలి. పారదర్శకపాలన, భూములు-రోడ్లు-నీటి సమస్యలు పరిష్కారం.. ఇవన్నీ కాంగ్రెస్ అభ్యర్థులే చేస్తారు. అభ్యర్థుల బలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులు ఇంటింటికీ చేరుతూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, తక్షణ పరిష్కారాలు చూపించేందుకు పార్టీ పటిష్ట ప్రణాళికలను వివరించారు. గ్రామాల్లో కాంగ్రెస్‌కు భారీస్పందన పలుగ్రామాల్లో ప్రజలు పెద్ద ఎత్తున బయటకువచ్చి అభ్యర్థులకు మద్దతు ప్రకటించడం గమనార్హం. స్థానిక యువత కూడా ప్రచారంలో పాల్గొనడంతో గ్రామాల్లో కాంగ్రెస్ క్యాంపెయిన్ కొత్త ఉత్సాహాన్ని సంతరించుకుంది. సర్పంచ్ పోరులో కాంగ్రెస్ బలం పెరిగిందని విశ్లేషణ. మండలంలోని పలుగ్రామాల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం కనిపిస్తోంది. కాంగ్రెస్ నాయకుల పర్యటనలతో పార్టీ శ్రేణులు మరింత బలంగా, చురుకుగా మారి, ఈసారి కాంగ్రెస్ బలంగా పోటీ ఇస్తూ అత్యంతమెజార్టీతో గెలుస్తుందని రాజకీయ వర్గాల అంచనా. కార్యక్రమంలో జిన్నారం, గుమ్మడిదల మండల నాయకులు సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, జిన్నారం మాజీ ఎంపిపి రవీందర్‌గౌడ్, మద్ది వీరారెడ్డి, మద్ది ప్రతాపరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, విప్ప రామ్‌రెడ్డి, ఆకుల ఆంజనేయులు, మహిపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

# చౌటకూరు జడ్పిహెచ్ఎస్‌లో తాగునీటి ఎద్దడి

## -తాగునీటికి ఇంటిబాట పడుతున్న విద్యార్థులు


చౌటకూరులో తాగునీటి కొరకు ఇంటి బాట పట్టిన విద్యార్థులు

**చౌటకూరు. డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో విద్యార్థులు తమ గొంతులను తడార్పుకునేందుకు ఇంటి బాట పట్టాల్సిన దయనీయ దుస్థితి దాపురించింది. పాఠశాల ఆవరణలో రక్షిత మంచినీటి ట్యాంక్ తాగునీటితో నింపుతున్నా పంచాయితీ సిబ్బంది ఆ నీటిని విద్యార్థులకు సరఫరా చేయకుండా పూర్తిగా గ్రామానికి సరఫరా చేస్తుండటంతో విద్యార్థులు దప్పిక తర్చుకునేందుకు తహతహ లాడక తప్పడం లేదు. విద్యార్థులు పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశాక కనీసం చేతులు కడుక్కునేందుకు నీరు అందుబాటులో లేక విద్యార్థులు ఇంట బాట పడుతున్నారు. మరుగుదొడ్లు దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా బోరు బావిని తవ్వించాలని పలు మార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకుపోయినా ప్రయోజనం లేకుండా పోతోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను ఎంపిడిఓ శంకర్ దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ ఆవేదన వ్యక్తం చేశారు. సబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో నీటి ఎద్దడిని నివారించాలని విద్యార్థులు, పోషకులు, ఉపాధ్యాయులు వినతి చేస్తున్నారు.

## ఊపందుకున్న నామినేషన్‌లు


మనూర్‌లో అభ్యర్థులు, మద్దతుదారులతో సందడిగామారిన దృశ్యం

**మనూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఈనెల 17న జరుగనున్న పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం నామినేషన్ దాఖలుకు చివరిరోజు కావడంతో నామినేషన్ కేంద్రాలవద్ద అభ్యర్థులు, మద్దతుదారుల కోలాహలం నెలకొంది. నామినేషన్‌ల దాఖలుకు మొదటిరోజైన బుధవారం సర్పంచ్ స్థానాలకు 17, వార్డు స్థానాలకు 2 నామినేషన్‌లు దాఖలుకాగా రెండవరోజైన గురువారం సర్పంచ్ స్థానాలకు 35, వార్డు స్థానాలకు 103 నామినేషన్‌లు వచ్చినట్లు ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం బెల్లాపూర్‌కు కాంగ్రెస్ మద్దతుదారు కె.రేషదిగంబర్‌రెడ్డి ఎన్నికల అధికారి శెట్కార్ రాజశేఖర్‌కు నామినేషన్ అందచేశారు. మండల కేంద్రమైన మనూర్‌లో కాంగ్రెస్ మద్దతుతో గంపల రమ్యసిద్దారెడ్డి, చీకూర్తి మీనాసతీష్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారు. నామినేషన్‌ల దాఖలుకు శుక్రవారం ఆఖరి రోజు కావడంతో ఆయాగ్రామాల నుంచి సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులు, తమ మద్దతుదారులతో యువత కేరింతలు వేస్తూ నృత్యాలు చేస్తూ బాజాభజంత్రీలమధ్య చేరుకోవడంతో మండలకేంద్రమైన మనూర్ జనసంద్రంగా మారింది. నామినేషన్‌ల దాఖలుకు పెద్ద ఎత్తున అభ్యర్థుల క్యూలైన్లు కానవచ్చాయి. ఎస్ఐ కోటేశ్వర్‌రావు నేతృత్వంలో బందోబస్తును నిర్వహించారు.

## ప్రమాదపు అంచున ప్రయాణం..ఆదమరిస్తే ప్రాణనష్టం..


ఎత్తు లోడ్‌తో వెళ్తున్న ఆటో

**పాపన్నపేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మెదక్ బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం మిన్పూర్ వద్ద మెదక్‌వైపు వెళుతున్న ఓ సామాగ్రి తరలించే(గూడ్స్) చిన్న ఆటో నాలుగుచక్రాల వాహనంలో పెద్ద ఎత్తున తెల్ల బంగారాన్ని విక్రయానికి తరలిస్తున్న వాహనంపై ప్రాణాలను లెక్క చేయకుండా విక్రయదారులు కాటన్‌పై కూర్చొని ప్రయాణంచేయడం కనిపించడంతో ఆ దృశ్యాన్ని కెమెరా క్లిక్ మనిపించింది.

## స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన

### -స్నేహపూర్వక పోటీతత్వంతో ఎన్నికలు జరుపుకోవాలి -మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్

**పాపన్నపేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో స్నేహపూర్వక పోటీతత్వంతో మెలగాలని మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని దుర్గమ్మ గైన్ వద్ద స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలే తప్ప, గొడవలు సృష్టిస్తే ఎన్నికల కేసులు నమోదు అవుతాయని, సామాన్య కేసుల కన్నా ఎన్నికల సమయంలో కేసులు నమోదు అయితే ప్రతి ఎన్నికల సమయంలో బైండోవర్ చేస్తారని, అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగ, పాస్‌పోర్ట్‌లు రావని, ఓట్లపండగ ఐదేళ్లకు ఒకసారి వస్తుందని, ఎన్నికల నియమావళిని అతిక్రమించకుండా ఉండాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా, ఎన్నికల అధికారుల విధులకు ఆటంకం కలిగించినా చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, అభ్యర్థులు మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారిపేర్లు గోప్యతతో ఉంచుతామని అన్నారు. ఎన్నికల ప్రచారాలు ఈ నెల 9న సాయంత్రం 5గంటల వరకు ముగించాలని, పోలింగ్‌కేంద్రంలో ప్రచారాలు నిర్వహించరాదని, పోలింగ్‌బూత్‌లలోకి చరవాణిలు నిషేధ మని, ఓటుహక్కు వినియోగించుకోవడం కోసం వెళ్ళే ప్రతి ఒక్క ఓటరూ స్లిప్పుతోనే వెళ్ళి ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ జార్జ్, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్థులు పోలీసులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యుడిగా దివ్యాంగుడి నామినేషన్


వార్డు సభ్యుడిగా నామినేషన్ వేస్తున్న దివ్యాంగుడు సురేందర్‌గౌడ్

**సిర్గాపూర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తానాబాద్ పంచాయతీ 9వ వార్డు సభ్యుడిగా దివ్యాంగుడైన సురేందర్‌గౌడ్ శుక్రవారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. గతంలో పంచాయతీలోని 4వ వార్డును ఒకమారు విజయం సాధించి మరోమారు ఓటమిపాలయ్యారు. ముచ్చటగా మూడోమారు పంచాయతీలోని 9వవార్డు అన్‌రిజర్వు కావడంతో సురేందర్‌గౌడ్ శుక్రవారం నామినేషన్‌ను అందచేశారు. ప్రజాసేవ చేసేందుకు పోటీ చేస్తున్నట్లు సురేందర్‌గౌడ్ పేర్కొన్నారు.

## ముగిసిన సైన్స్ ఫెయిర్


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

**మెదక్, డిసెంబరు 5, ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక వెస్లీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్స్పైర్, సైన్స్ ఫెయిర్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్, నగేష్ అదనపు ఎస్పీ మహేందర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని బయటిప్రపంచాన్ని ఆదృక్పథంతో గమనించి, వినూత్నంగా ఆలోచించి కొత్తకొత్త ఆవిష్కరణలకు బీజం వెయ్యాలని సూచించారు. విజేతలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. పాల్గొన్న విద్యార్థులందరికీ ఆశీస్సులు అందించారు. అలాగే ఈ కార్యక్రమ నిర్వహణకు కృషిచేసిన కార్యాలయ సిబ్బందిని ఆతిథ్యం ఇచ్చినందుకు వెస్లీ ఉన్నతపాఠశాల సిబ్బందిని యాజమాన్యాన్ని అదనపు కలెక్టర్ నగేష్ అభినందించారు.